సాక్షి ఖమ్మం

ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025



పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు

తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో నేటి పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని నాయకులు సూచించారు. 8లో



వారం పాటు 'విమోచనం'

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని బీజేపీ ఆధ్వర్యాన నిర్వహిస్తామని ఆ పార్టీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
31° / 23°

వాతావరణం

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు తక్కువగానే నమోదవుతాయి. కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీవారి పాదంతో పాటు స్వామి మూల విరాట్‌కు అర్చకులు పంచామృతంతో అభిషేకాలు చేశారు. అలాగే, స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్యకల్యాణం జరిపించాక, భక్తుల సమక్షాన పల్లకీ సేవ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కొత్తూరి జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

టెట్ తీర్పుపై ప్రభుత్వం అప్పీల్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయులు సర్వీస్‌లో కొనసాగాలన్నా, పదోన్నతి పొందాలన్నా టెట్ తప్పక ఉత్తీర్ణత సాధించాలంటూ వెలువడిన కోర్టు తీర్పు సీనియర్ ఉపాధ్యాయులకు అశనిపాతంలా మారిందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలో శనివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ కోర్టు తీర్పు సీనియర్ ఉపాధ్యాయులకు నష్టం కలిగించేలా ఉన్నందున రాష్ట్రప్రభుత్వం తీర్పుపై అప్పీల్ చేసి సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. అంతేకాక పదోన్నతుల్లో మిగిలిన ఖాళీ పోస్టులకు అర్హులను ఎంపికచేయాలని, గిరిజన సంక్షేమశాఖ, మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. తొలుత ఇటీవల మరణించిన పూర్వ జిల్లా అధ్యక్షుడు జియావుద్దీన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నాయకులు జీవీ.నాగమల్లేశ్వరరావు, బుర్రి వెంకన్న, షమీ, రాందాస్, నర్సయ్య, సురేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మీదుగా మరో ప్రత్యేక రైలు

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం మీదుగా ఇప్పటికే ఉన్న వారాంతపు ప్రత్యేక రైలుకు తోడు మరో రైలును రైల్వే శాఖ ప్రకటించింది. నాందేడ్ - తిరుచానూర్ మధ్య ఈనెల 16, 23, 30వ తేదీల్లో ఈ రైలు ప్రారంభమవుతుందని ఖమ్మం సీసీటీఓ రాజగోపాల్ తెలిపారు. తిరుగుప్రయాణంలో ఈనెల 17, 24, వచ్చేనెల 1వ తేదీన ఉంటుందని వెల్లడించారు. ఈ రైలు తిరుచానూర్ వెళ్లేటప్పుడు నిర్ణీత తేదీల్లో అర్ధరాత్రి 1-13 గంటలకు, నాందేడ్ వెళ్లే క్రమంలో తెల్లవారుజామున 3-45 గంటలకు ఖమ్మం చేరుకుంటుందని తెలిపారు. దసరా, దీపావళి పండుగల వేళ స్వస్థలాలకు వెళ్లే వారి కోసం ఈ రైలు నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు.

టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



శ్రీనివాసరావును సన్మానిస్తున్న హెచ్‌డబ్ల్యూఓల ఫోరం బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తెలంగాణ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటుకు కృషి చేసిన టీజీఈ జేఏసీ సెక్రటరీ జనరల్, టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావును వసతి గృహ సంక్షేమ అధికారుల ఫోరం బాధ్యులు శనివారం సన్మానించారు. వసతి గృహ సంక్షేమ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పాటుపడాలని కోరారు. టీఎన్జీవోస్ నాయకుడు హరికృష్ణ కోణార్, వసతి గృహ సంక్షేమ అధికారుల ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోటపాటి రుక్మారావు, ఎన్.నాగేశ్వరరావుతో పాటు కె.తిరుపతిరావు, పి.హన్మంతరావు, సీహెచ్.నాగమణి, బి.వసంత, మాధురి, బాలాజీ, నర్సింహారావు, రమాదేవి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఇటీవల ఎన్నికైన మున్సిపల్ ఫోరం జిల్లా కార్యవర్గ బాధ్యులు ఏలూరి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.సుధాకర్, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఊరూరా వరి !

జిల్లాలో ప్రధాన పంట అయిన వరి ఈసారి సాగు లక్ష్యాన్ని దాటుతోంది. సమృద్ధిగా వర్షాలతో జలవనరులు కళకళలాడుతుండడం.. ధాన్యానికి మద్దతు ధరతో పాటు సన్న రకాలకు ప్రభుత్వం బోనస్ ఇస్తుండడంతో రైతులు ఇటే మొగ్గుచూపారు. జిల్లాలో ఈ వానాకాలం వరి 2,95,100 ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటికే 2,90,660ఎకరాల్లో సాగవడం, ఇందులో సన్నరకాలే ఎక్కువగా ఉండడం విశేషం. ప్రస్తుతం పంటల నమోదు ప్రక్రియ కొనసాగుతున్నందున ఈ విస్తీర్ణం 3లక్షల ఎకరాలకు చేరే అవకాశముందని భావిస్తున్నారు. – ఖమ్మం వ్యవసాయం



సత్తుపల్లి సమీపాన సాగవుతున్న వరి పంట

జిల్లాలో లక్ష్యాన్ని దాటేలా పంట సాగు

- మద్దతు ధరకు తోడు బోనస్‌తో అన్నదాతల ఆసక్తి
- అనుకూలించిన వానలతో ఉత్సాహం
- ఇప్పటికే 2.90 లక్షల ఎకరాల్లో పంట

సరిపడా వానలు

ఈ ఏడాది పంటల సాగుకు వర్షాలు అనుకూలించాయి. సీజన్‌లో జూన్ మినహా, జూలై, ఆగస్టు నెలల్లో సాధారణానికి మించి వర్షపాతం నమోదైంది. జూన్‌లో 131.2 మి.మీ. వర్షపాతానికి గాను 123.9గా నమోదైతే, జూలైలో 240.9 మి.మీ.కు 281.6, ఆగస్టులో 240మి.మీ.కు గాను 389.7గా నమోదు కావడంతో జలాశయాల్లోకి సమృద్ధిగా నీరు చేరింది.

వివిధ పద్ధతుల్లో సాగు

వర్షాలు సమృద్ధిగా కురవడంతో రైతులు వరి సాగుకు ప్రాధాన్యత ఇచ్చారు. కూలీల కొరత, ఇతర ఇబ్బంతుల నేపథ్యాన రకరకాల విధానాలు ఎంచుకున్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో పొడి దుక్కుల్లోనే వరి విత్తనాలు చల్లగా, కొందరు భూములను దమ్ము చేసి విత్తనాలను ఒకరోజు నానబెట్టి వెదజల్లే పద్ధతిలో సాగు చేశారు. ఇంకొందరు డ్రమ్ సీడర్ విధానం ద్వారా విత్తనాలు నాటారు. మరికొందరు సంప్రదాయ విధానంలో వరి నార్లు పోసి నాట్లు వేశారు.

సత్తుపల్లి డివిజన్‌లో అత్యధికం

జిల్లాలోని సత్తుపల్లి వ్యవసాయ డివిజన్‌లో అత్యధికంగా 1,28,434 ఎకరాల్లో వరి సాగవుతోంది. ఈ డివిజన్‌లోని కల్లూరు మండలంలో 33,403ఎకరాల్లో పంట సాగు చేశారు. ఆ తర్వాత స్థానంలో పాలేరు(కూసుమంచి) వ్యవసాయ డివిజన్‌లో 72,259 ఎకరాల్లో సాగవుతోంది. అలాగే, మధిర వ్యవసాయ డివిజన్‌లో 41,356, వైరా డివిజన్‌లో 36,281, ఖమ్మం డివిజన్‌లో 12,530 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు.

సమృద్ధిగా నీరు ఉండడంతో...



మంచి వర్షాలతో జలాశయాల్లోకి నీరు చేరడం వరి సాగుకు అనుకూలించింది. మొత్తం 20ఎకరాల్లో వెదజల్లే పద్ధతి, డ్రమ్‌సీడర్, నాట్ల విధానంతో సాగు చేస్తున్నాం. ప్రభుత్వం బోనస్ ఇస్తుండడంతో మొత్తం సన్నరకాలే ఎంచుకున్నాం.

– దేవరపల్లి సత్యనారాయణరెడ్డి, కమలాపురం, ముదిగొండ మండలం

సన్నరకాలకు ప్రాధాన్యత



అన్ని వ్యవసాయ డివిజన్లలో వరి లక్ష్యం మేర సాగవుతోంది. జూలై, ఆగస్టులో కురిసిన వాన సాగుకు అనుకూలించింది. వరిలో కూడా రైతులు సన్నరకాలకే ప్రాధాన్యత ఇచ్చారు. ప్రభుత్వం బోనస్ ఇస్తుండటంతో ఈ రకాలే ఎంచుకున్నారు.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

మండలాల వారీగా గత ఏడాది, ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు (ఎకరాల్లో)

మండలం	సాగు అంచనా	2024	2025
కామేపల్లి	6,000	6,057	5,932
ఖమ్మం అర్బన్	2,200	2,226	2,314
రఘునాథపాలెం	5,500	4,710	4,284
ఖమ్మం రూరల్	7,000	6,948	7,178
కూసుమంచి	23,200	24,024	23,523
నేలకొండపల్లి	27,500	27,287	28,057
తిరుమలాయపాలెం	13,500	13,272	13,501
బోనకల్	6,300	6,176	6,165
చింతకాని	6,000	6,358	6,034
మధిర	6,200	6,351	5,703
ముదిగొండ	14,200	14,525	13,871
ఎర్రుపాలెం	10,500	10,073	9,583
కల్లూరు	33,400	33,668	33,403
పెనుబల్లి	23,100	23,121	23,160
సత్తుపల్లి	20,600	18,958	19,694
తల్లాడ	23,000	22,987	23,375
వేంసూరు	28,000	27,318	28,602
ఏన్కూరు	4,900	4,411	4,727
కొణిజర్ల	8,500	7,351	7,054
సింగరేణి	5,500	5,544	5,517
వైరా	20,000	19,217	18,983
మొత్తం	2,95,100	2,90,582	2,90,660

ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం





లోక్‌అదాలత్‌తో మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్ (ఇన్‌సెట్) రాజీ పడిన వారికి అవార్డు కాపీ, మొక్క అందజేస్తున్న జిల్లా జడ్జి

- జిల్లా జడ్జి రాజగోపాల్
- లోక్ అదాలత్‌లో 4,771 కేసుల పరిష్కారం

ఖమ్మంలీగల్: రాజీ మార్గంలో కేసుల పరిష్కారం ద్వారా ఆరోగ్యకరమై సమాజ నిర్మాణానికి అంతా కలిసి రావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ సూచించారు. ఖమ్మం జిల్లా కోర్టులో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో రాజీ పడితే ఇరువర్గాలు గెలిచినట్లేనని తెలిపారు. కుటుంబ వివాదాల కేసుల్లో భార్యాభర్తలు కలిస్తే వారి సంతానంతో పాటు ఇరు కుటుంబాలు సంతోషంగా ఉంటాయన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు మాట్లాడగా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యాన కక్షిదారులకు భోజనం, తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. న్యాయమూర్తులు దేవినేని రాంప్రసాదరావు, న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖరరావుతో పాటు ఎం.కల్పన, టి.మురళీమోహన్, కాసరగడ్డ దీప, బి.రజిని, ఏపూరి బిందుప్రియ, వినుకొండ మాధవి, బి.నాగలక్ష్మి, అఖిల, లోక్ అదాలత్ సభ్యులు సంధ్యారాణి, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.3.15 కోట్ల పరిహారం

లోక్‌అదాలత్‌లో భాగంగా పలు కేసులను న్యాయమూర్తులు పరిష్కరించారు. మోటార్ వాహన కేసును వాది తరఫున న్యాయవాది పోట్రు వెంకయ్య చౌదరి, రాయల్ సుందరం బీమా కంపెనీ తరఫున బండారుపల్లి గంగాధర్ వాదించారు. ఈమేరకు కేసు పరిష్కారం కాగా వాదికి రూ.19.50 లక్షల అవార్డు కాపీతో పాటు పూల మొక్కను జిల్లా జడ్జి రాజగోపాల్ అందించారు. అలాగే దంపతులు పెద్ద బోయిన మాధవి–లక్ష్మణ్ కేసు ప్రత్యేక కోర్టు న్యాయధికారి బి.నాగలక్ష్మి చొరవతో పరిష్కారమైంది. మొత్తంగా లోక్‌అదాలత్‌లో 4,771 కేసులను పరిష్కరించారు. ఇందులో మోటారు వాహన ప్రమాద బీమా కేసులు 80 ఉండగా, బాధితులకు పరిహారంగా రూ.3,16,71,251 ఇవ్వడానికి బీమా కంపెనీలు అంగీకరించాయి. అలాగే, క్రిమినల్, చెక్ బౌన్స్, కుటుంబ తగాదా, సివిల్ ఇతర కేసుల్లో ప్రతివాదులకు రూ.30,17,255 పరిహారం అందింది.

ఫీజుల కోసం పోరుబాట

- రీయింబర్స్‌మెంట్ బకాయిలపై విద్యాసంస్థల నిర్ణయం
- రేపటి నుంచి రెండు రోజులు నిరసనలు



సమావేశంలో పాల్గొన్న విద్యాసంస్థల యాజమాన్యాలు

ఖమ్మం సహకారనగర్: పేద, మధ్య తరగతి విద్యార్థుల చదువుకు ఇబ్బంది లేకుండా వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారు. నాటి నుంచి ఎందరో విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉచితంగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరారు. కానీ కొన్నేళ్లుగా ప్రభుత్వాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో తమపై భారం పడుతోందని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. మూడేళ్లుగా బకాయిలు విడుదల కాక విద్యాసంస్థల నిర్వహణ ఇబ్బందిగా మారిందని, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేక నిరసనలకు నిర్ణయించామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో డిగ్రీ, ఇంజనీరింగ్, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ కళాశాలలు వంద వరకు ఉండగా, రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాక కళాశాలల నిర్వహణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది వేతనాలు, అద్దె చెల్లింపులకు కష్టంగా మారిందని యాజమాన్యాలు చెబుతున్నాయి.

రౌండ్ టేబుల్ సమావేశంలో కార్యాచరణ

ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ, పీజీ, ఫార్మసీ, ఇంజనీరింగ్ విద్యాసంస్థల బాధ్యులు ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో శనివారం సమావేశమయ్యారు. ఇంజనీరింగ్ విద్యాసంస్థల యాజమాన్యాల అధ్యక్షుడు చలసాని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన యాజమాన్యాలు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై మూడేళ్లుగా ప్రభుత్వ నిర్లక్ష్యంతో కళాశాలలు నడపడం కష్టంగా మారిందన్నారు. ఎస్‌బీఐటీ చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలన్నారు. కాగా, తొలిదశలో ఈనెల 15న సోమవారం విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, యాజమాన్యాలతో ఖమ్మం అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన తెలుపుతామని, 16వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ కాలేజీల యాజమాన్య బాధ్యులు ఉషాకిరణ్, శ్రీధర్, కాటేపల్లి నవీన్‌బాబు, సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పోరాడిన సురవరం

- సుధాకర్‌రెడ్డి మృతి ప్రజాఉద్యమాలకు తీరని లోటు
- సంస్మరణ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజల కోసం పోరాడిన నికార్సయిన కమ్యూనిస్టు సురవరం సుధాకర్‌రెడ్డి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇటీవల మృతి చెందిన సురవరం సంస్మరణ సభ ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శనివారం నిర్వహించగా ఆయన చిత్రపటం వద్ద వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రజాఉద్యమ గొంతుకగా సురవరం పనిచేశారని, ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమానికే కాక పేద ప్రజలకు తీరని లోటన్నారు. కాగా, మతం, సైన్స్‌కు ప్రాంతీయ భేదం లేనట్లే కమ్యూనిజానికి సైతం ప్రాంతీయత లేదన్నారు. కమ్యూనిజం విడిపోయి బలహీనపడినా మళ్లీ ఐక్యతతో బలపడతామని తెలిపారు. అందరినీ ఏకతాటిపైకి తీసుకురావడమే సుధాకర్‌రెడ్డి లాంటి అమరులకు ఇచ్చే నివాళి అని చెప్పారు. కాగా, వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ ఘట్టాన్ని నేటి తరానికి వివరిస్తూ బలమైన ప్రజాఉద్యమ నిర్మాణాల కోసం డిసెంబర్ 26న ఖమ్మంలో శత వసంత ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు కూనంనేని తెలిపారు. ఈ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పోరాటాలను నడిపిన సురవరం ఎందరికో ఆదర్శంగా నిలిచారని తెలిపారు. గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో పాటు వివిధ పార్టీలు, సంఘాల నాయకులు బాగం హేమంతరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డాక్టర్ రవీంద్రనాథ్, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఆవునూరి మధు, నున్నా నాగేశ్వరరావు, మహ్మద్ మౌలానా, కె.రాంనారాయణ, ఆకుతోట ఆదినారాయణ, జమ్ముల జితేందర్‌రెడ్డి, స్వర్ణ భాస్కర్, రవిమారుత్, పోట్ల మాధవరావు, డాక్టర్ వై.ప్రసాద్, వడ్డె నారాయణరావు, యర్రా బాబు, జానీమియా, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, క్లైమెంట్, మహ్మద్ సలాం, పోటు కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 16 నుంచి 'యాత్రాదానం'

- దాతలు కోరుకున్న రోజుల్లో బస్సుల ఏర్పాటు
- ఆర్టీసీ రీజియన్ మేనేజర్ సరిరాం



ఖమ్మంమయూరిసెంటర్: ప్రత్యేక రోజుల్లోఅనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు, విహారయాత్రలకు తీసుకెళ్లేలా టీజీఎస్‌ఆర్టీసీ 'యాత్రాదానం' పేరిట కార్యక్రమాన్ని రూపొందించిందని ఖమ్మం రీజియన్ మేనేజర్ సరిరామ్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తాము కోరుకున్న రోజుల్లో పర్యటనకు తీసుకెళ్లేలా విరాళం అందజేయొచ్చని తెలిపారు. విరాళం ఆధారంగా ఏసీ, సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు సమకూరుస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వివరాల కోసం సమీప ఆర్టీసీ డిపోల్లో సంప్రదించాలని ఆర్‌ఎం సూచించారు.

దూరం ఆధారంగా ప్యాకేజీల వారీ చార్జీల వివరాలు

దూరం (కి.మీల్లో.)	ఎక్స్‌ప్రెస్ (రూ.ల్లో)	డీలక్స్	సూపర్‌లగ్జరీ	రాజధాని
0-200	26,707	32,587	29,752	43,507
201-300	32,587	32,587	29,752	43,507
301-400	38,782	38,782	35,002	43,507
401-500	44,977	44,977	40,252	50,962

జిల్లా అంతటా వర్షం

- కల్లూరు అత్యధికంగా 70 మి.మీ. వర్షపాతం
- పలుచోట్ల ఉధృతంగా వాగులు



తాడు సాయంతో కూలీలను దాటించేందుకు యత్నిస్తున్న స్థానికులు

ఖమ్మంవ్యవసాయం: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా శనివారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతంగా ఉండగా, సాయంత్రం 3గంటల తర్వాత వర్షం ప్రారంభమైంది. పలుచోట్ల దాదాపు రెండు గంటల పాటు వర్షం కురిసింది. అత్యధికంగా కల్లూరు మండల కేంద్రంలో 70.3 మి.మీ.ల వర్షపాతం నమోదు కాగా, తిమ్మారావుపేటలో 68.5, మధిరలో 60.8, గంగారంలో 52.8, వేంసూరులో 49, ఎర్రుపాలెంలో 48.8, ముదిగొండలో 45, మధిర ఏఆర్ఎస్‌లో 42.8, పెద్ద గోపతిలో 41.5, పెనుబల్లిలో 38.3, ఏన్కూరులో 35.8 గేటు కారేపల్లిలో 33.5, గౌరారంలో 32, సత్తుపల్లి ఓసీ వద్ద 30.5, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 29.3, చింతకానిలో 29, సత్తుపల్లి, సదాశివునిపాలెంలో 25, పంగిడిలో 21, ఖమ్మం ఎన్ఎస్‌పీ గెస్ట్‌హౌస్ వద్ద 20.3 మి.మీల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువన వర్షాలతో వరద వాగుల్లోకి చేరి ఉధృతంగా ప్రవహించాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత వర్షాలు పంటలకు ప్రయోజనం కలిగిస్తాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరదలో చిక్కుకున్న కూలీలు క్షేమం

ఏన్కూరు: ఏన్కూరు మండలం కేసుపల్లి పరిధిలో కొందరు కూలీలు శనివారం వరదలో చిక్కుకున్నారు. పొలాల్లో పని ముగించుకొని సాయంత్రం వస్తుండగా ఏలుగోడు వాగు ప్రవాహంతో చిక్కుకపోయారు. గ్రామస్తులు తాళ్ల సాయంతో రక్షించేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. కాసేపటికి వరద తగ్గడంతో కూలీలు వాగు దాటి క్షేమంగా గ్రామానికి చేరారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి అంతరాలయంలోని మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామి వారిని పల్లకీసేవగా చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జోరు వర్షంలోనూ ఆగని దందా



వానలోనే ఇసుక లోడ్ చేస్తున్న కూలీలు

ప్రమాదకర పరిస్థితుల్లో ఇసుక రవాణా

నేలకొండపల్లి: ఇసుక అక్రమంగా తరలిస్తున్న వారు పగలు, రాత్రీ తేడాను పట్టించుకోకపోగా జోరు వర్షాన్ని సైతం లెక్క చేయడం లేదు. నేలకొండపల్లి మండలంలోని రామచంద్రాపురం, పైనంపల్లి ఏటి పరీవాహకం నుంచి పలువురు అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారు. శనివారం వర్షంతో ఓ పక్క ఏరు ఉధృతంగా ప్రవహిస్తున్నా ప్రమాదం జరుగుతుందని తెలిసి కూడా ఇసుక తవ్వి ట్రాక్టర్లలో తరలించారు. గతంలో ఇదే ఏటిలో ప్రమాదవశాత్తు మునిగిన ఇద్దరు మృతి చెందారు. అయితే, ఇసుక అక్రమ తరలింపు వ్యవహారం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

క్లుప్తంగా

నిరుపేద విద్యార్థులకు చేయూత



విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువుతకు చేయూతనిస్తున్న పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని కూసుమంచి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రరావు, విశ్రాంత ఏడీ పి.కోటేశ్వరరావు కొనియాడారు. వైరాకు చెందిన బసవోజు మనోజ్, ఖమ్మం వైఎస్సార్ కాలనీకి చెందిన తాటికొండ సోమశేఖర్‌కు ట్రస్ట్ తరఫున రూ.20వేల చొప్పున చెక్కులను శనివారం ఖమ్మంలో అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య, మహంకాళి స్వరాజ్యలక్ష్మి, పరిశ లక్ష్మీరాజ్యం, శ్రీనివాసరావు, ఊడుగు వెంకటేశ్వరరావు, సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆవేదనను గుర్తించండి



వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

పెనుబల్లి: గ్రీన్ ఫీల్డ్ హైవేపై సర్వీస్ రోడ్డు లేకపోతే రైతులు ఇబ్బంది పడనున్నందున వారి ఆవేదనను అధికారులు గుర్తించాలని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పేర్కొన్నారు. పెనుబల్లి, వేంసూరు మండలాల రైతులు హైవే వెంట చిన్న బ్రిడ్జిలకు బదులు సర్వీస్ రోడ్డు నిర్మించాలనే డిమాండ్‌తో రెండో రోజైన శనివారం కూడా నిరసన తెలిపారు. ఈమేరకు కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్‌కు దయానంద్ సమాచారం ఇవ్వగా ఆయన చేరుకుని వివరాలు ఆరాతీశారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ సర్వీస్ రోడ్లు లేకపోతే రైతులు పొలాలకు వెళ్లాలంటే 10కి.మీ. చుట్టూ తిరగాల్సి వస్తుందని తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. భూనిర్వాసిత రైతులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, నాయకులు కీసర వెంకటేశ్వరరెడ్డి, చీకటి రామారావు, వి.పవన్, గూడూరు మాధవరెడ్డి, దొంతు మాధవరావు, ఈడా కమలాకర్, పిల్లి నవజీవన్ పాల్గొన్నారు.

మధిరలో కోదాడ ఎమ్మెల్యే



ఎమ్మెల్యే పద్మావతితో నాయకులు

మధిర: రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సతీమణి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి శనివారం మధిర వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క క్యాంప్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డితో పాటు అనిల్‌కుమార్ నెహ్రూ, కరివేద సుధాకర్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం పద్మావతి డిప్యూటీ సీఎం సతీమణి నందినితో సమావేశమయ్యారు. అలాగే, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోహిందర్ సింగ్ సైతం మల్లు నందినితో సమావేశం కాగా ఆయనను సన్మానించారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

మోతె: టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిళ్లగూడెం శివార్లలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెర్వుకు చెందిన గుండమాల వెంకన్న(50) టీవీఎస్ ఎక్సెల్‌పై మోతె వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మామిళ్లగూడెం శివారులో వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకన్నను 108లో ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని ఎస్‌ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

ఆదిలోనే హంసపాదు

- వేంసూరు మండలంలో '2782' వరి రకం సాగు
- 90 రోజులకే 40శాతం మేర ఈనిన పంట
- ఫలితంగా దిగుబడిపై రైతుల్లో ఆందోళన



40శాతం మేర ఈనిన వరి పంట



ముందుగానే ఈనిన వరి పంటలో రైతులు

వేంసూరు: రాష్ట్రప్రభుత్వం సన్న రకం ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండడంతో రైతులు ఈసారి ఎక్కువగా సన్నరకాల సాగుకే ప్రాధాన్యత ఇచ్చారు. అయితే, కల్తీ విత్తనాలా, ఇంకేదైనా కారణమో తెలియదు కానీ వేంసూరు మండలంలో పలువురు సాగు చేసిన వరి ముందుగానే ఈనింది. దీంతో మిగతా పంట ఈనేలోగా మొదటి గింజలు రాలిపోతే దిగుబడి తగ్గుతుందని ఆందోళన చెందుతున్నారు.

దిగుబడి వస్తుందని...

వేంసూరు మండల వ్యాప్తంగా ఈ వానాకాలం సీజన్‌లో 28 వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఇందులో 27 వేల ఎకరాలు సన్న రకాలే ఉన్నాయి. మండలంలోని కందుకూరు, భరణిపాడు, మర్లపాడు, చౌడవరం, కుంచపర్తి గ్రామాల రైతులు పంట కాలం ఎక్కువైనా దిగుబడి బాగుంటుందనే భావనతో కరీంనగర్ వరణ్ అగ్రిటెక్‌కు చెందిన బీపీటీ 2782 రకం విత్తనాలు ఎంచుకున్నారు. మండలంలో దాదాపు 3వేల ఎకరాలల్లో ఈ రకాన్ని సాగు చేయగా 150 రోజుల పంట కాలం కలిగిన ఈ రకం 120 రోజుల తర్వాత ఈతకు రావాలి. కానీ 90 రోజులకే 40శాతం మేర పంట ఈనుతుండడంతో రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు సత్తుపల్లి మండలం నారాయణపురం, కందుకూరు డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. దాదాపు బీపీటీ 2782 వరి రకం మొత్తం ముందుగానే ఈనుతుండడంతో ఏం చేయాలో పాలుపోని స్థితి ఎదుర్కొంటున్నారు.

దిగుబడిపై ప్రభావం

వరి సాగు చేసిన రైతులు ఎకరాకు రూ.30వేల పెట్టుబడి పెట్టారు. అయితే, 2782 రకం వరి 120రోజులకు ఈతకు రావాల్సి ఉండగా వరి 90రోజులకే 40శాతం ఈనుతుండడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. మరో 30రోజుల తర్వాత మిగతా వరి ఈనేలోగా ముందుగా ఈనిన వరి గింజలు రాలిపోతే దిగుబడి తగ్గే అవకాశముందని చెబుతున్నారు. మొత్తంగా ఎకరాకు 20బస్తాల దిగుబడి తగ్గనుండడంతో పెట్టుబడి కూడా రాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు విత్తన కంపెనీ యాజమాన్యం, అధికారులు వరి పంటను పరిశీలించి తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

30 ఎకరాల్లో సాగు చేశా...



ఎకరాకు రూ.30వేల చొప్పున పెట్టుబడితో 30ఎకరాల్లో బీపీటీ 2782 రకం సాగు చేశా. ముందుగానే సగం పొలం ఈనుతోంది. వెనుక పంట ఈతకు వచ్చేలోగా ముందు పంట రాలిపోతుంది. దీంతో పెట్టుబడి కూడా వస్తుందో, రాదో తెలియడం లేదు.

– గొర్ల రాజశేఖర్‌రెడ్డి, రైతు, కందుకూరు

దిగుబడి తగ్గినట్లే...



20ఎకరాల్లో బీపీటీ 2782 రకం సాగు చేశా. పంటకాలం కంటే ముందే వరి ఈనడంతో దిగుబడి సగానికి పైగా తగ్గుతుంది. ఎకరాకు 50 బస్తాల దిగుబడి వస్తుందని చెప్పారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేనందున కంపెనీ యాజమాన్యమే న్యాయం చేయాలి.

– ఒగ్గు సత్యనారాయణరెడ్డి, రైతు, కందుకూరు

జోరు వాన.. పెరిగిన వరద



ఎర్రుపాలెం : ములుగుమాడులో రోడ్డు ప్రవహిస్తున్న వాగు వరద



కల్లూరురూరల్ : వాగును తలపిస్తున్న రహదారి



ముదిగొండ : ఎస్‌బీఐ ఎదుట రోడ్డుపై వరద



మధిర : మాటూరుపేటలో ప్రవహిస్తున్న వాగు



ఎర్రుపాలెం : రాకపోకలు నిలిపేస్తూ పెట్టిన ట్రాక్టర్

కల్లూరురూరల్: కల్లూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు వర్షం ఆగకుండా కురవడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. పలుచోట్ల డ్రెయినేజీలు నిండి ఇళ్లు, లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది.

- తల్లాడ: తల్లాడ మండలంలో శనివారం మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6గంటల వరకు వర్షం కురిసింది. తల్లాడ పరిసర గ్రామాల్లో రోడ్లపై వరద నీరు చేరింది. తల్లాడలోనూ ప్రధా, అంతర్గత రహదారులు, పలు కార్యాలయాల వద్ద నీరు నిలిచింది.
- మధిర: మధిర మండంలోని పలు మండలాల్లోనూ వర్షం కురిసింది. నిదానపురం, మాటూరుపేటల్లో వర్షం కారణంగా రోడ్లపై నీరు నిలవడంతో పాటు లోతట్టు ప్రాంతాల్లోకి వరద చేరింది.
- ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలంలో భారీ వర్షం, ఎగువ నుండి కట్లేరుకు పెరుగుతున్న వరదతో ములుగుమాడులోని కట్లేరు వాగు పొంగింది. దీంతో ములుగుమాడు–ఇనగాలి మధ్య రాకపోకలు నిలిపివేశారు. కాగా, కట్లేరుకు వరద రావడంతో పరీవాహకంలో వరి పంట నీటమునిగింది.
- ముదిగొండ: ముదిగొండ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ముదిగొండ ప్రధాన సెంటర్, వల్లభి రోడ్డు, ఎస్‌బీఐ ఎదుట ఖమ్మం – కోదాడ రహదారిపై వర్షపు నీరు చేరడంతో చెరువును తలపించింది. రోడ్డు లోతట్టుగా ఉండడంతో నీరు నిలిచి వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చింతకాని: మండలంలోని నాగిలిగొండకు చెందిన ఉచ్చర్ల కల్యాణ్(31) ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈనెల 11న పురుగుల మందు తాగాడు. దీంతో ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై ఆయన తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు. కాగా, కల్యాణ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పురుగుల మందు తాగిన యువకుడు..

ఖమ్మంక్రైం: ఖమ్మం మున్నేటి ఒడ్డున ఈనెల 9వ తేదీన పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. నేలకొండపల్లి మండలం బుద్దారానికి చెందిన పాశం బ్రహ్మారెడ్డి(28) ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తుండగా, మద్యానికి బానిసైన ఆయనను జీతం డబ్బు ఇవ్వటం లేదని తల్లి మందలించింది. దీంతో 9వ తేదీన పురుగుల మందుతాగి అపస్మారక స్థితికి చేరగా పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందగా కేసు నమోదు చేశామని ఖమ్మం త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు తెలిపారు.

అక్రమ తవ్వకాలను అడ్డుకున్న అధికారులు

కొణిజర్ల: అటవీ ప్రాంతంలో గుట్ట భూమిని తవ్వుతున్న ఓ ముఠాను అటవీ, పోలీస్ అధికారులు శనివారం అడ్డుకున్నారు. మండలంలోని తుమ్మలపల్లి బీట్ సౌత్ కంపార్ట్‌మెంట్ 49 లో రూ.కోట్ల విలువైన అటవీ భూమి ని కొందరు ఆక్రమించుకుని చెట్లు కొడుతూ మట్టి చదును చేస్తున్నారు. ఈ విషయమై అందిన సమాచారంతో అటవీ, పోలీస్ ఉద్యోగులు వెళ్లి జేసీబీని స్వాధీ నం చేసుకున్నారు. అయితే, మట్టి తవ్వకందారులు తిరి గి జేసీబీని లాక్కునే ప్రయత్నంచగా పోలీసులు వారిని అడ్డుకుని వాహనాన్ని ఖమ్మం తరలించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు వారిని అభినందించారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వైరా: వైరా బీసీ హాస్టల్ సమీపంలోని ఓఇంట్లో అక్రమంగా నిల్వచేసిన ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఉద్యోగులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్న రేచర్ల సైదులును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్‌తో పాటు సివిల్ సప్లయిస్ ఉద్యోగులు తనిఖీల్లో పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

తిరుమలాయపాలెం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లోని గృహోపకరణాలు కాలిపోవడంతో రూ.1.50లక్షల మేర నష్టం జరిగింది. మండలంలోని గోల్‌తండాకు చెందిన బానోతు ఉపేందర్ ఇంట్లో శనివారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో కూలర్‌లోని గడ్డికి నిప్పంటుకుంది. ఆ తర్వాత మంటలు వ్యాపిస్తూ స్మార్ట్ టీవీ, ఫ్రిడ్జ్ ఇతర సామగ్రి కాలిపోగా విద్యుత్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

కూసుమంచి: మండలంలోని ధర్మాతండా స్టేజీ వద్ద శనివారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం గుంపుల మాదారం గ్రామానికి చెందిన కొదుమగుంట్ల ఉపేందర్, శిరీష దంపతులు బైక్‌పై ఖమ్మం వెళ్లి వస్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వారిని 108 వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు



చింతకాని : ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న హేమంతరావు

చింతకాని/బోనకల్: నైజాం నిరంకుశ పాలనను అంతమొందించేందుకు సాగిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు భాగం హేమంతరావు పిలుపునిచ్చారు. చింతకాని మండలం ప్రొద్దుటూరులో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తాళ్లపల్లి రాములు, బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్)లో అమరవీరుల స్థూపం వద్ద ఆయన నివాళులర్పించి మాట్లాడారు. ఆనాటి తెలంగాణ సాయుధ పోరాటం రాచరికం, నిర్బంధానికి వ్యతిరేకంగా సాగితే బీజేపీ మాత్రం ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. సాయుధ పోరాటంలో నిజాం రాజుకు వ్యతిరేకంగా పోరాడిన వారిలో అన్ని వర్గాల వారు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్‌రావు, దూసరి గోపాలరావు, యంగల ఆనందరావు, అబ్బూరి మహేష్, పదిమెల వెంకటనర్సయ్య, పగిడిపల్లి ఏసు, తాళ్లపల్లి అజయ్, పెంట్యాల చలమయ్య, వేల్పుల కోటయ్య, తుళ్లూరు శ్రీనివాసరావు, తుడుం పాలరావు, పెంట్యాల రామారావు, పాపినేని రంగారావు, పులి యజ్ఞనారాయణ, జక్కుల రామారావు, వల్లంకొండ బ్రహ్మం, కొత్తపల్లి రమేష్, తమ్మారపు లక్ష్మణ్‌రావు, తమ్మారపు బ్రహ్మయ్య, కొత్తపల్లి కృష్ణ పాల్గొన్నారు.

పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

బోనకల్: అకాల వర్షాలతో నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం అధ్యక్షుడు భాగం హేమంతరావు డిమాండ్ చేశారు. బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్)లో దెబ్బతిన్న పత్తి పంటలను సీపీఐ జిల్లా కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అధిక వర్షాలతో పత్తి దిగుబడి పడిపోయే ప్రమాదం ఉన్నందున ప్రభుత్వం సర్వే చేయించి రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. నాయకులు, రైతులు జక్కుల రామారావు, యంగల ఆనందరావు, పుచ్చకాయల తిరుపతయ్య, గోళ్ల కనకయ్య, చింతలచెర్వు మదారయ్య పాల్గొన్నారు.

వారం పాటు విమోచన దినోత్సవం

బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని బీజేపీ ఆధ్వర్యాన రాష్ట్రంలో వారం పాటు నిర్వహించనున్నామని ఆ పార్టీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. ఈ వేడుకలకు కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ఖమ్మంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి ప్రమాణస్వీకారానికి కాంగ్రెస్ నేతలు హాజరు కాకపోవడం గర్హనీయమన్నారు. ఇదే సమయాన ఆ పార్టీ నేత రాహుల్‌గాంధీ రాజ్యాంగంపై మాట్లాడడం ద్వంద్వ స్వభావానికి నిదర్శనమని తెలిపారు. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నా రైతుల సమస్యలపై దృష్టి సారించడం లేదని ఆరోపించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి సరఫరా చేసిన యూరియాను దారి మళ్లించడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, ఇందుకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వైఫల్యమే కారణమని తెలిపారు. కాగా, ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా 11ఏళ్ల పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తామని పొంగులేటి వెల్లడించారు.

- తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడులో పోరాటయోధుడు సోయబ్ ఉల్లాఖాన్ విగ్రహానికి బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి నివాళులర్పించారు. ఈనెల 17న తెలంగాణ విమోచన దినోత్సవంగా జరపనున్న నేపథ్యాన రాష్ట్రవ్యాప్తంగా పోరాటయోధులను స్మరించుకోనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, నున్నా రవికుమార్, దొంగలసత్యనారాయణ, ఈవీ.రమేష్, జి.వెంకటేశ్వర్లు, సుబ్బారావు, ప్రభాకర్‌రెడ్డి, గుత్తా వెంకటేశ్వర్లు, సుదర్శన్ మిశ్రా, నల్లగట్టు ప్రవీణ్‌కుమార్, రవిరాథోడ్, విజయరెడ్డి, రజనీరెడ్డి, నెల్లూరి బెనర్జీ, నగరికంటి వీరభద్రం, మహేష్, ఇందూరి మహేష్, గంట్ల లక్ష్మారెడ్డి, భూక్యా వెంకటేష్, నల్లగట్టు ఉపేందర్, నాగరాజు, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం.. సాహిత్య గుమ్మం

'నెనరు–నెమరు' సంపుటి ఆవిష్కరణలో వక్తలు



నరసింహారెడ్డిని సత్కరిస్తున్న కవులు, రచయితలు

ఖమ్మంగాంధీచౌక్: ఆధునిక సాహిత్యంలో తెలుగు రాష్ట్రాల్లోనే ఖమ్మం కేంద్రంగా నిలుస్తోందని కవి, విమర్శకులు, మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి తెలిపారు. ఖమ్మం జెడ్పీ సమావేశ మందిరంలో కవి వంశీకృష్ణ తల్లి తాటికొండల భ్రమరాంబ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం శనివారం నిర్వహించారు. ఈ పురస్కారాన్ని నరసింహారెడ్డికి అందజేయగా ఆయన మాట్లాడారు. భక్త రామదాసు, ప్రముఖ భాషావేత్తలు నడియాడిన నేలపై సాహిత్య పురస్కారం అందుకోవడం తనకు ప్రత్యేకమని తెలిపారు. అనంతరం రచయిత్రి, అనువాదకురాలు స్వర్ణ కిలారి, కుటుంబీకులు రాసిన భ్రమరాంబ స్మృతి గీతాల సంపుటి 'నెనరు–నెమరు'ను ఆవిష్కరించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్, కవి, సంపాదకులు ఆనందాచారి మాట్లాడగా, కేంద్ర సాహిత్య అకాడమీ సలహామండలి సభ్యులు ప్రసేన్‌తో పాటు మువ్వా జయశ్రీ, వంశీకృష్ణ, సీతారాం, రవిమారుత్, ఇబ్రహీం, నిర్గుణ్, సుభాషిణి, సీలిమ, వీఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.

ఐస్ స్కేటింగ్‌లో పతకాల పంట

- మోటమర్రి క్రీడాకారిణి నయనశ్రీ ప్రతిభ
- అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లడానికి ఆర్థిక ఇక్కట్లు



స్కేటింగ్ రింగ్‌లో నయనశ్రీ



పోటీల్లో సాధించిన పతకంతో నయనశ్రీ (ఫైల్)

బోనకల్: ఐస్ స్కేటింగ్ అంటే ఆమెకు ప్రాణం. దీంతో ఆటపైనే దృష్టి సారించగా.. తల్లిదండ్రులు ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నా ప్రోత్సహించడంతో పతకాల మోత మోగిస్తోంది. బోనకల్ మండలం మోటమర్రి గ్రామానికి చెందిన తాళ్లూరి నయనశ్రీ ప్రస్తుతం బెంగళూరులో డిగ్రీ చదువుతోంది. గ్రామానికి చెందిన నారాయణరావు – వీణ దంపతుల ఏకైక కుమార్తె అయిన నయనశ్రీ తొమ్మిదేళ్ల వయస్సు నుంచే హైదరాబాద్ కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియంలో స్కేటింగ్‌లో శిక్షణ తీసుకుంటోంది. ఇమె ప్రతిభను గుర్తించిన కోచ్ ఐస్ స్కేటింగ్‌పై దృష్టి సారించాలని సూచించగా.. 2017లో తొలిసారి ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. అలాగే, 2018లో సింగపూర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో రజిత పతకం సాధించింది. నాటి నుంచి నేటి వరకు జరిగిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో 17 పతకాలు సాధించగా.. జాతీయ స్థాయిలో 23, రాష్ట్రస్థాయిలో 20కి పైగా పతకాలను గెలుచుకుంది. గత నెల డెహ్రాడూన్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో రెండు రజితం, రెండు కాంస్య పతకాలను సాధించిన ఆమె నవంబర్‌లో కజకిస్తాన్‌లో జరిగే జూనియర్ వరల్డ్ కప్ పోటీలకు సిద్ధమవుతుంది. అయితే, శిక్షణ కోసం సౌత్ కొరియా వెళ్లాల్సి ఉండగా.. దాదాపు రూ.10లక్షల మేర నగదు అవసరమతుంది. నయనశ్రీ తల్లిదండ్రులు చిన్నపాటి ఉద్యోగాలు చేస్తుండటంతో వారు భారం మోసే పరిస్థితి లేదు. దీంతో దాతలు, క్రీడాభిమానులు సహరించాలని కోరుతున్నారు.